సాక్షి నిర్మల్

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రాత..దాటొద్దు గీత

ఎన్నికల బరిలో ఉన్న నేతలు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై పోలీసు యంత్రాంగం సైతం నిఘా ఉంచింది. IIలో▸

నేడు పీవోలు, ఏపీవోలకు శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలలో పీవో, ఏపీవోలుగా విధులు కేటాయించబడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మంగళవారం మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలో విధులు కేటాయించబడ్డ వారికి కొండాపూర్ లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో, ఖానాపూర్ పరిధిలోని వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ముథోల్ నియోజకవర్గ పరిధిలోని వారికి బాసర ట్రిపుల్‌ఐటీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /19.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా, రాత్రి చల్లగా ఉంటుంది. చలి ప్రభావం స్వల్పంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మొక్కజొన్న వ్యర్థాలు తొలగింపు


ట్రాక్టర్‌తో వ్యర్థాల తొలగింపు

సాక్షి స్పందన

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో 'అగ్నికి ఆహుతవుతున్న హరితహారం మొక్కలు' శీర్షిక న సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో మోహన్‌రెడ్డి స్పందించారు. రహదారిపై ఉన్న మొక్కజొన్న వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో తొలగింపజేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలను కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలన్నా రు. రహదారులపై ఆరబెడితే వ్యర్థాలను నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. అంతకు ముందు కాలినచెట్లను పరిశీలించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ అంకం మహేశ్వర్, కార్మికులు లస్మన్న, భూమన్న, సాయన్న, బొమ్మి సాయన్న పాల్గొన్నారు.

జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యుడి రాజీనామా


రాజీనామాపత్రం చూపుతున్న స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: జిల్లా బాలల సంక్షేమ కమిటీ స భ్యుడు స్వదేశ్ పరికిపండ్ల సోమవారం తన ప దవికి రాజీనామా చేశారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కలిసి రాజీనామా పత్రం అందజేశారు. ఆయన కొంతకాలంగా జిల్లా బాలల సంక్షే మ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం 'ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం' ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం పో రాడుతున్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ రానున్న శాసన సభ ఎన్నికల్లో పోటీలో ఉండాలని గల్ఫ్ సంఘాల సమన్వయ కమిటీ సూచించినట్లు తెలిపారు. దీంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అంశంపై రా నున్న రెండు, మూడు రోజుల్లో భవిష్యత్ కా ర్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కనకాపూర్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు


కనకాపూర్‌లో కవాతు చేస్తున్న జవాన్లు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌లో జాతీయ రహదారిపై సోమవారం బీఎస్‌ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎస్సై రవి, సోన్ ఎస్సై రవీందర్, బీఎస్‌ఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించినట్లు సీఐ ఎల్ శ్రీను తెలిపారు.

అనంతపేటలో..

నిర్మల్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం మండలంలోని అనంతపేటలో బీఎస్‌ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

భైంసాటౌన్: భైంసా ఆర్టీసీ డీఎం అమృత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు డీఎం తెలిపారు. కుభీర్ మండలం చాతా గ్రామానికి అదనంగా బస్ సర్వీస్ నడపాలని కోరగా రెగ్యులర్ సర్వీస్‌తో పాటు అంద్ బోరికి బస్ నడుపుతున్నామని, రద్దీ ఉంటే పరిశీలిస్తామని ఆమె సమాధానం ఇచ్చారు. లోకేశ్వరం మీదుగా నందిపేట్‌కు ఉదయం 11 గంటలకు సర్వీస్ నడపాలని కోరగా పరిశీలిస్తామన్నారు. పంచగుడికి బస్ సౌకర్యం కల్పించాలని కోరగా ప్రైవేట్ వాహనాల కారణంగా రద్దు చేసినట్లు తెలిపారు. భైంసా నుంచి కరీంనగర్‌కు బస్ సౌకర్యం కల్పించాలని కోరగా పరిశీలిస్తామని చెప్పినట్లు డీఎం తెలిపారు.

లాట్ ఎక్కువస్తే బీట్ బందే..!


భైంసా మార్కెట్‌యార్డులో రాత్రిపూట సోయా కొనుగోళ్లు

- భైంసా వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల తీరు
- చేతులెత్తేస్తున్న అధికారులు
- ఇబ్బంది పడుతున్న రైతులు

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, అధికారుల తీరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పంట ఉత్పత్తులు అధిక మొత్తంలో తెచ్చినప్పుడు సకాలంలో తూకం వే య లేక చేతులెత్తేస్తున్నారు. మరుసటి రోజు తాత్కాలికంగా బీట్ నిలిపేస్తుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల శనివారం బీట్ బంద్ ఉంచడం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం భారీగా పంట ఉత్పత్తులు విక్రయానికి తెచ్చారు. లాట్ నంబర్ కేటాయింపు, ఆన్‌లైన్‌లో ధరల నమోదులో తీవ్ర జాప్యం కావడంతో తూకాలు వేయలేమని వ్యాపారులు చేతులెత్తేశారు. మరుసటి రోజు మంగళవారం బీట్ బంద్ ఉంచాలని మార్కెట్ కమిటీ అధికారులను కోరగా మంగళవారం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు నిలిపి వేయనున్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు ప్రకటించారు. లాట్ నంబర్ కేటాయింపులో జాప్యం కావడంతోపాటు ఈ నామ్ సర్వర్‌లో ధరల నమోదు ఆలస్యం కావడంతో తూకాలు పూర్తికాక ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బుధవారం తిరిగి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మాటిమాటికీ బంద్..

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులకు చేతికొచ్చిన పంట ఉత్పత్తుల విక్రయానికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే భైంసా వ్యవసాయ మార్కెట్ రెండో అతి పెద్ద మార్కెట్. పత్తితో పాటు సోయా ఇక్కడి ప్రాంతంలో ప్రధాన పంట. రైతులు పండించిన పంట ఉత్పత్తులను భైంసా వ్యవసాయ మార్కెట్ లోనే విక్రయిస్తారు. పత్తి మినహా మిగిలిన పంట ఉత్పత్తులు ఈ నామ్ విధానంలోనే కొనుగోలు చేస్తారు. వ్యవసాయ మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటీవల శుక్రవారం మార్కెట్‌కు అధిక సంఖ్యలో పంట ఉత్పత్తులు రావడంతో సకాలంలో తూకాలు పూర్తి చేయలేక శనివారం, ఆదివారం బీట్ నిలిపేశారు. దీంతో సోమవారం సైతం భారీగా పంట ఉత్పత్తులు విక్రయానికి తేవడంతో మరోమారు ఒకరోజు కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇలా తరచూ బీట్ నిలిపేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక మొత్తంలో పంట ఉత్పత్తులు వస్తే కొనుగోలుదారులు చేతులెత్తేస్తుండడంతో అధికారులు సైతం నిస్సహాయ స్థితిలో తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపేస్తున్నారు. పరిమితికి మించి లాట్‌లు వస్తే కొనుగోలు దారులు, రైతులను సమన్వయపరచి సకాలంలో కొనుగోళ్లు పూర్తి చేయాల్సిన అధికారులు బీట్ బంద్ ఉంచడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల మార్కెట్ యార్డులో సోయా విక్రయానికి తెచ్చిన రైతుపై హమాలీ రేకు డబ్బాతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం కారణగానే రైతులపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. లాట్‌లు అధిక సంఖ్యలో వచ్చినపుడు సకాలంలో కొనుగోళ్లు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొద్దటినుంచి పడిగాపులు...



పొద్దున 10 గంటలకు సోయాలు తెచ్చిన. ఇప్పుడు రాత్రి ఎనిమిది అయితంది. ఇప్పటికీ కాంటా కాలేదు. హమాలీలు పొద్దుగాల చేస్తమంటుండ్రు. తిండికి, రాత్రంతా ఉండడానికి తిప్పలు పడుతున్నం. కొనుగోళ్లు త్వరగా జరిగేలా చూడాలి.

– లచ్చన్న, రైతు, నగర్

జాగారం చేసుడైతంది



రైతుకు పంట పండించుడే కాక అమ్ముడుకు కూడా తిప్పలే ఉన్నది. పొద్దున్నుంచి మార్కెట్లనే పడి ఉన్న. ఇప్పటిదాకా కాంటా చేయలే. అ న్నం కూడా తినకుండా పడిగాపులు కాస్తున్న. రాత్రి ఇంటికి పోదామంటే కుప్పల దగ్గర ఎట్లా అని ఈడనే జాగారం చేసుడైతంది.

– విఠల్, రైతు, కామోల్

సర్వర్ సమస్యతోనే...

లాట్ నంబర్ కేటాయింపు, ఆన్‌లైన్‌లో ధరల నమోదుకు సర్వర్ సమస్య తలెత్తింది. దీంతోపాటు లాట్లు కూడా ఎక్కువగా రావడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. కొనుగోళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– అడెల్లు, ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి, భైంసా

కోడ్ ఉల్లంఘిస్తే 'సీ-విజిల్' ద్వారా ఫిర్యాదు చేయవచ్చు

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనపై సీ విజిల్ యాప్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాలలో ఎన్నికల సంఘం స్పందిస్తుందన్నారు. ఫొటోలు లేదా వీడియోలను యాప్‌లో అప్లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం నుంచి సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సీ విజిల్ యాప్‌ను ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్‌లోడ్ చేయాలన్నారు.

సామాన్యులకు అండగా పోలీసులు


- ఎస్పీ ప్రవీణ్ కుమార్


అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సామాన్యులకు అండగా పోలీసులు ఉండాలని, వారితో స్నేహభావంగా మెలగాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునే వారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనబడితే 8712659599 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆధార్ తరహాలో 'అపార్'

- విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- కేంద్రం మార్గదర్శకాలు జారీ
- పూర్తి సమాచారం ఇందులోనే నిక్షిప్తం
- తల్లిదండ్రుల సమ్మతితో ముందుకు..
- విద్యాశాఖ కసరత్తు షురూ



అపార్‌కార్డు

నిర్మల్‌ఖిల్లా: 'ఆధార్' తరహాలో విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో 'వన్ నేషన్-వన్ ఐడీ' కార్డును అందుబాటులోకి తేనున్నారు. వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర విద్యావనరులశాఖ తాజాగా ఆదేశించింది. అపార్ ఐడీ కార్డును దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ అపార్ సంఖ్యనే విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థి అకడమిక్ జర్నీ, విద్యా ప్రయాణం, విజయాలు నిక్షిప్తమై ఉంటాయి. అవసరమైన సమయంలో ట్రాక్ చేయొచ్చని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమ్మతి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలను కోరింది. ఈ అపార్ ఐడీ ప్రాముఖ్యతను వివరించాలని చెప్పింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని సూచించింది. ఇందుకు ఓకే చెప్పిన తల్లిదండ్రులు ఆతర్వాత ఎప్పుడైనా దాన్ని ఉపసంహరించుకోవచ్చని కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది.

ప్రయోజనం ఏమిటి?

విద్యార్థి కేజీ నుంచి పీజీ వరకు చదివిన, చదువుతున్న సమగ్ర వివరాలు ఒకే గొడుగు కిందకు వస్తాయి. ఎల్‌కేజీలో చేరినప్పట్నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈ కార్డు ఉపయోగపడనుంది. ఈ కొత్త కార్డును ఆధార్ సంఖ్యతో పాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ)' అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించబడి ఉంటుంది. పాఠశాల విద్యలోని పిల్లలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇచ్చే విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 'చైల్డ్ ఇన్ఫో' పేరిట ఒక్కో విద్యార్థికి, ఒక్కో సంఖ్య విధానాన్ని కొన్నేళ్లుగా అమలు చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ అమలు చేయబోతున్న ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకు దాదాపు 26 కోట్ల మంది విద్యార్థులకు 12 అంకెలున్న సంఖ్యను కేటాయిస్తారు.

'అపార్' నిర్వహణ ఇలా...

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరంకు ఈ బాధ్యతను అప్పగించింది. దీనికి చైర్మన్‌గా ఏఐసీటీఈ మాజీ చైర్మన్ ఆచార్య సహస్రబుద్దే వ్యవహరిస్తున్నారు. ఆధార్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక సంఖ్యను నమోదుచేస్తే విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలు, పొందిన స్కాలర్‌షిప్స్, తదితర వివరాలన్నీ తెలుసుకునే వీలుంటుంది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలోనూ ధ్రువీకరణ పత్రాలను భౌతికంగా కాకుండా డిజిటల్‌లో పరిశీలించి సీటు ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షల దరఖాస్తుల్లోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే సరిపోతుందని ఏఐసీటీఈ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నమోదు ప్రక్రియ

తల్లిదండ్రుల సమ్మతితో పాఠశాలలో నమోదు ప్రక్రియ నిర్వహించబడుతుంది, వారు ఏ సమయంలోనైనా వారి సమ్మతిని ఉపసంహరించుకోవచ్చు. అవసరమైతే సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే డేటాను పంచుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పాఠశాలల ద్వారా ప్రతీ విద్యార్థిపై సేకరించిన డేటా జిల్లా సమాచార పోర్టల్‌లో నిల్వ చేయబడుతుంది.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
ఆదిలాబాద్	1,439	1,27,361
కుమురంభీం	1,253	89,301
మంచిర్యాల	1,049	1,02,127
నిర్మల్	1,044	1,14,185

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4 వేలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, దాదాపు 200కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 4 లక్షలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ స్థాయిలో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఐడీ నంబరు కేటాయించబడింది. కళాశాల స్థాయిలో మరో గుర్తింపు సంఖ్య ఉంటుంది. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న అపార్ ఐడీ కార్డు ద్వారా మొత్తం ఒకే కార్డులో పూర్తి విద్య ప్రగతి, సమాచారం నిక్షిప్తమై అందుబాటులోకి రానుంది.

ప్రయోజనకరంగా ఉంటుంది



విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం ఏకీకృతంగా అపార్ కార్డు ద్వారా అందుబాటులోకి రావడం ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యార్థికి సంబంధించిన సమాచారం ఒకే ఐడీ నంబర్ ద్వారా నిక్షిప్తమై ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించిన తర్వాత వారి అనుమతితేనే విద్యాశాఖ ముందుకెళ్తుంది.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

విద్యార్థులకు సౌలభ్యం



విద్యార్థి తన విద్యాభ్యాస దశలో వివిధ రకాల ప్రాంతాల్లో అభ్యసిస్తాడు. వీటన్నింటిని ఒకే గొడుగు కిందికి తేవడం అనేది శుభ పరిణామం. ఈ అపార్ ఐడీ విధానం విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. పదేపదే టీసీలు, బోనఫైడ్, పత్రాలు సేకరించడం వంటి సమస్యలు తీరుతాయి. విద్యార్థి ప్రగతి నైపుణ్యాలు ఒకేచోట నిక్షిప్తం చేయబడతాయి. – జిలకరి రాజేశ్వర్, తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, నిర్మల్

నామినేషన్ల స్వీకరణలో సమయపాలన పాటించాలి


- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: నామినేషన్ల స్వీకరణలో సమయపాలన పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై న్యూఢిల్లీ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌వ్యాస్, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో కార్యాలయంలో ఒకే గడియారం ఉండాలన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈవీఎం యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. సీవిజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రూ.10 లక్షల కంటే అధికంగా నగదు జప్తు చేసిన సమయంలో ఐటీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధనికుడికి, ఉద్యమకారుడికి మధ్యే పోటీ

- ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్ ఎన్నికల ప్రజా క్షేత్రంలో ధనికుడైన జాన్సన్‌నాయక్, ఉద్యమకారుడైన వెడ్మ బొజ్జుకు మధ్యే పోటీ ఉంటుందని, బీజేపీ తమకు పోటీయే కాదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం సోమవారం తొలిసారి ఖానాపూర్‌కు వచ్చిన బొజ్జుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను కించపరిచేలా స్థానికేతర అభ్యర్థిని పోటీలో నిలిపిన మంత్రి కేటీఆర్‌కు జాన్సన్‌నాయక్ ఓడించి గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు, ప్రజల చిరకాల కోరిక ఖానాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. తాను లంబాడాలకు వ్యతిరేకం కాదన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆదివాసీల సమావేశంలో తాను మాట్లాడిన ఎజెండాను కొంతమంది తాను లంబాడాలకు వ్యతిరేకం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈవిషయమై గతంలోనే తాను క్షమాపణ కోరానని గుర్తుచేశారు.

ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి పనిచేస్తా

ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌తో కలిసి తాను పనిచేస్తానన్నారు. పార్టీ అధిష్టానం తనకు టికెట్ ఇచ్చి తాను అమ్ముడుపోయానని తప్పుడు ప్రచారం చేసిన వారి నోర్లు మూయించిందన్నారు. అంతకుముందు కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, నాయకులు నిమ్మల రమేశ్, గంగనర్సయ్య, తోట సత్యం, జహీర్ హైమద్, షబ్బీర్‌పాషా, మజీద్, సలీంఖాన్, అమానుల్లా ఖాన్, జంగిలి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన రమాదేవి


రమాదేవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

భైంసాటౌన్: బీజేపీకి రాజీనామా చేసిన డాక్టర్ పడకంటి రమాదేవి సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు భైంసా నుంచి అభిమానులు, అనుచరులతో భారీ వాహనశ్రేణి ర్యాలీతో హైదరాబాద్ తరలివెళ్లారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ముథోల్ ఇన్‌చార్జి పురాణం సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఐకేరెడ్డి వాహనం తనిఖీ


మంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సోన్: నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మంత్రి ఐకేరెడ్డి వాహనాన్ని సోమవారం నిజామాబాద్ జిల్లా మెండోర మండలం బుస్సాపూర్ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల వేళ తనిఖీలు సాధారణమే అని అన్నారు. పోలీసులకు పూర్తి సహకారం అందించినట్లు తెలిపారు.

ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండించిన మంత్రి


నిర్మల్‌టౌన్: మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఓటమి భయంతో హింసా రాజకీయాలకు పాల్పడే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

2న రౌండ్ టేబుల్ సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: దళితులు, వ్యవసాయ కూలీల సమస్యలపై నవంబర్ 2న నిర్మల్‌లో జరుగనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల హక్కుల పరిరక్షణ కోసం డిసెంబరు 4న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కోటి సంతకాలు సేకరణ చేసి రాష్ట్రపతికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో తిరుపతి, ముత్తన్న,గంగారాం, జాదవ్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆ ఊరిలో మహిళలందరూ ఓటేశారు



పిప్పల్‌ధరి గ్రామం

బోథ్‌: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లందరూ తమ ఓటును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో మొత్తం 367 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 179, మహిళలు 188 మంది ఉన్నారు. పురుషులు 168 మంది, మహిళా ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ గ్రామంలో 97 శాతం పోలింగ్‌ నమోదైంది. నియోజకవర్గంలో ఈ గ్రామంలోనే అత్యధిక పోలింగ్‌ శాతం నమోదైంది. కాగా, ఈ ఎన్నికల్లో వందశాతం పోలింగ్‌లో పాల్గొని ఓటేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన

భైంసాటౌన్‌: పట్టణంలోని పార్డి(బి)బైపాస్‌ రోడ్‌లో సీఎం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ పరిశీలించారు. సోమవారం భైంసాకు చేరుకున్న ఆయన సభాస్థలికి చేరుకుని, హెలీప్యాడ్‌, ఇతర ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆయన వెంట పట్టణ సీఐ ఎల్‌. శ్రీను, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ జెకె పటేల్‌ ఉన్నారు.

ఏలేటికి రూ.1,00,116 చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: బీజేపీ నిర్మల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని చామన్‌పెల్లి పసుపు రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రూ.1,00,116 చెక్కు అందజేశారు. ఏలేటిపై తమ అభిమానం చాటుకున్నారు. నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు మల్లేశ్‌, సాయన్న, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

'జంతర్‌మంతర్‌' వద్ద ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్‌: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ ధర్నాలో జిల్లా నుంచి ఆశ కార్యకర్తలు, ఆశ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు. పి.జయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి గంగమని, గౌరవ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు భాగ్య, పద్మ, ఇంద్రమల, సరిత, గోదావరి, సుగుణ పాల్గొన్నారు.

పాటకు జై..ప్రచారానికి సై

- ప్రత్యేక గీతాలతో హోరు
- పార్టీ, అభ్యర్థుల ప్రత్యేక పాటలు రికార్డింగ్‌
- ఓటర్లను ఆకర్షించేలా వ్యూహాలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచారసందడి షురువైంది. గోడరాతలు పోస్టర్లు సభలు సమావేశాలకు తోడుగా ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణగణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డింగ్‌ చేయించారు. జనాల మధ్య పాటల్ని పెద్ద లౌడ్‌స్పీకర్లలో పెడుతున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. దసరా నవరాత్రులు పూర్తవడంతో క్రమంగా ప్రచారపర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుతెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్‌ చేయించి రికార్డు చేశారు. కాగా ఈ పాటల్ని డిజిటల్‌ విధానంలో లౌడ్‌స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేక వాహన ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యకర్తల్లో జోష్‌

ఆయా రాజకీయ పార్టీలు డీజే సౌండ్‌ బాక్స్‌తో కూడిన ఆకట్టుకునే రీతిలో వినూత్నంగా సంగీతంతో కూడిన పాటలతో హోరెత్తిస్తున్నారు. ఎల్‌ఈడీ తెరలపై పార్టీ అభ్యర్థుల హామీలు, మేనిఫెస్టో, నేపథ్యం చాటేచిత్రాలు, వీడియోలతో బ్యాగ్రౌండ్‌లో పాటలను ఆసక్తి పెంచేలా తయారు చేస్తున్నారు.

గ్రామాల్లో ప్రచార సందడి

నవరాత్రోత్సవాలు పూర్తవడంతో ప్రచార పర్వం ఊపందుకుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పరిధిలోని గ్రామాల్లో ప్రచారం మొదలైంది. డీజే సౌండ్‌బాక్స్‌లతో కూడిన అభ్యర్థులు, పార్టీలకు సంబంధించి ప్రచారహోరు ఎక్కడికక్కడ కనిపిస్తోంది. జిల్లాలో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులతో కూడిన ప్రచారం కనిపిస్తుంది. ఇప్పటికే నిర్మల్‌, ఖానాపూర్‌, ముధోల్‌ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కొలిక్కి రావడంతో ప్రచార రథాలు సైతం రోడ్డెక్కాయి. మైక్‌సెట్‌, మాట్లాడేందుకు స్పీకర్లతో కూడిన సౌకర్యాలతో అవి సిద్ధమయ్యాయి. దీనికితోడు డ్రైవర్‌ మాత్రమే కలిగి ఉండే పార్టీ ప్రచారాన్ని సూచించే పాటలతో కూడిన వాహనాలను ఓటర్లను ఆకట్టుకునేలా తీర్చిదిద్ది గ్రామాల వెంట తిప్పుతున్నారు.



నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు (ఫైల్‌)

ఇప్పటికే డీజేతో కూడిన ప్రత్యేక వాహనాల్లో పాటల సందడి మొదలైంది. పార్టీ కోసం అభ్యర్థి కోసం రాయించిన పాటలను వినిపిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు.

అభ్యర్థి, పార్టీ..పాటలు ప్రత్యేకం

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమ పేరు వచ్చేలా కనీసం మూడు నుంచి ఐదు పాటలు రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డింగ్‌ చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్టానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ, పథకాలను సూచించేవిధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం దాదాపు 6 నుంచి 8 పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్‌ఈడీ తెరలపై వీడియోలు జతచేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీత దర్శకుడు, స్టూడియో, వాయిద్యాకారులు, గాయకులు వీడియో ఎడిటింగ్‌ కలిపి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుంది.

కళాజాత బృందాలు బిజీబిజీ

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాత బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో ఒక బృందం అభ్యర్థి వెంట మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశపెట్టిన పథకాలు, ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాత బృందాలు శ్రమించనున్నాయి. స్థానిక భా షలో అర్థమయ్యేలా బృందాలు పాటలు, గాత్ర రూ పంలో పనిచేయనున్నాయి. ఇందుకు జానపద కళా కారులు బృందాలను ఆయా పార్టీలు ముందస్తు ఒ ప్పందాలు చేసుకుంటున్నాయి. రానున్న 30 రో జుల పాటు ఉధృత ప్రచార హోరు కనిపించనుంది.



పాటలు పాడుతున్న కళాకారుల బృందం సభ్యులు (ఫైల్‌)

రాత.. దాటొద్దు గీత



- సామాజిక మాధ్యమాలపై పోలీస్‌ శాఖ నిఘా
- ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో వాట్సాప్‌ గ్రూప్‌లు

నిర్మల్‌చైన్‌గేట్‌: అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచార పర్వం వేడెక్కుతుంది. బరిలో ఉన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాలపై దృష్టిసారిస్తున్నారు. వాట్సాప్‌, ఎక్స్‌ ఖాతా, ఇన్‌స్టాగామ్‌, యూట్యూబ్‌, ఫేస్‌బుక్‌ తోపాటు మరికొన్ని సోషల్‌ మీడియా వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో పలువురు నేతలు ఇప్పటికే వాట్సాప్‌ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకోగా, పోస్టు చేసేందుకు యువకులు, బృందాలను నియమించుకుంటున్నారు. ఇక ఫేస్‌బుక్‌, ఎక్స్‌ ఖాతాను విద్యార్థులు, యువత ఎక్కువగా వినియోగిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ఓటర్లకు చేరవేసేలా..

ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేల అభ్యర్థులు, ఆశవాహుల అభ్యర్థుల పేర్ల మీద యువసేన పనిచేస్తోంది. ఇందులో యువతే అధికంగా ఉండడంతో ఆయా పార్టీలకు ఉపయోగపడనుంది. నియోజకవర్గాల వారీగా వాట్సాప్‌ ద్వారా తమ సందేశాన్ని తెలిపేందుకు యత్నిస్తున్నాయి. ఇందుకు ఓటర్ల సెల్‌ఫోన్‌ నంబర్లు అవసరం. వాటి సేకరణ బాధ్యత గ్రామాల పార్టీ శ్రేణుల నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల బాధ్యులతో పార్టీ ప్రచార సందేశాన్ని ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

వాట్సాప్‌ గ్రూప్‌ల ద్వారా అధ్యయనం

బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావడంతో ప్రచారం ఆరంభమైంది. నాయకుల అనుచరుల ప్రచారం, ఫొటోలు, వీడియోలను ఫేస్‌బుక్‌, ఇతర సోషల్‌ మీడియాలో అప్‌లోడ్‌ చేస్తున్నారు. పార్టీలు ఇప్పటికే గ్రామ,మండల,నియోజకవర్గ స్థాయి వాట్సాప్‌ గ్రూప్‌ ఏర్పాటు చేస్తున్నారు. ఇది కాకుండా నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిని చేరుస్తూ ముఖ్యనాయకుల గ్రూప్‌ ఒకటి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రానికి సమీపంలోని నియోజకవర్గ తాజా, మాజీ ఎమ్మెల్యే గ్రామస్థాయిలో అసంతృప్తులు, ప్రజలేమనుకుంటున్నారు. ఏం కోరుకుంటున్నారు.. అనే విషయాలను గ్రామస్థాయి కార్యకర్తల వాట్సాప్‌ గ్రూప్‌ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రచారంలో వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. నాయకుల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి తరఫున సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తున్నారు. అందులో నాయకుల కటౌట్లతో ఫొటోలను తయారు చేసి ప్రచారం చేస్తున్నారు.

ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పోలీస్‌ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షణాల్లో వదంతులు సృష్టించి వ్యాప్తిచేసే సోషల్‌ మీడియాపై నిఘా ఉంచారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా పెట్టారు. ఇప్పటికే ఎన్నికల సంఘం సాంకేతికతను వినియోగించుకుంటోంది. అభ్యర్థులు ఎవరైన నియమావళి ఉల్లంఘిస్తే ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

శెభాష్‌ 'డ్రైవర్‌'

- బస్సులో అస్వస్థతకు గురైన మహిళ
- నేరుగా ఆస్పత్రికి తరలింపు

నర్సాపూర్‌(జి): ఆర్టీసీ బస్సులో మహిళ ప్రయాణికురాలు అస్వస్థతకు గురైంది. అప్రమత్తమైన డ్రైవర్‌ నేరుగా బస్సును ఆస్పత్రికి తరలించి ఆమె ప్రాణాలు కాపాడి శెభాష్‌ అనిపించుకున్నాడు. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్‌ నిర్మల్‌–భైంసా వెళ్తుండగా సోమవారం నర్సాపూర్‌(జి) వద్ద నిలిపింది. నిర్మల్‌లోని రాంనగర్‌ కాలనీకి చెందిన షహదా బేగం బస్సు ఎక్కి అస్వస్థతకు గురైంది. అప్రమత్తమైన డ్రైవర్‌ డ్రైవర్‌ లింగన్న, కండక్టర్‌ చొప్పదండి భోజన్న బస్సును నేరుగా నర్సాపూర్‌(జి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుడు



చికిత్స పొందుతున్న షహదా బేగం

సాయికృష్ణ, హెడ్‌నర్స్‌ లలిత, నర్స్‌ సునీత ఆమెను పరీక్షించి సెలైన్‌ ఎక్కించారు. ఈ విషయమై వైద్యుడిని 'సాక్షి'సంప్రదించగా సదరు మహిళ ఏమి తినకుండా ఖాళీ కడుపుతో ప్రయాణించడం వల్ల బీపీ, షుగర్‌ లెవల్స్‌ తగ్గాయన్నారు. మహిళా కోలుకున్న అనంతరం ఇంటికి పంపించేశారు. చాకచక్యంగా వ్యవహరించిన బస్‌ డ్రైవర్‌ను పలువురు అభినందించారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని దొంగచింత పంచాయతీ పరిధి భీంజీగూడకు చెందిన ఆదివాసీ బాలిక హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ సభ్యురాలు ఈశ్వరిబాయి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ సభ్యురాలు నీలాబాయి డిమాండ్‌ చేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. బాలిక హత్యకు గురైన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంతకు ముందు ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతులు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకుని వారిని శిక్షపడేలా చూస్తామని డీఎస్పీ తమతో పేర్కొనట్లు వారు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని అడ్డగుట్టలో నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై ముజాహిద్‌ తెలిపారు. పక్కా సమాచారంతోనే గ్రామంలో దాడి చేశామన్నారు. మడావి జంగు, మడావి సుపారీ, టేకం రాములు ఒక్కొక్కరి వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఓట్‌.. నాట్‌ ఫర్‌ సేల్‌



నర్సాపూర్‌(జి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎండీ జాబీర్‌ ఓ సందేశాన్ని తమ ఇంటి గోడపై రాయించాడు. 'ఈ ఇంటి ఓట్లు అమ్మబడవు 'ఓటు ఆయుధం దానిని మతం కోసమో! కులం కోసమో! దబ్బు కోసమే! వృథా చేయకండి..అని రాయించి ఓటర్లను ఆలోచించేలా చిన్న ప్రయత్నం చేశాడు.

ఉట్నూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలో పోలీసులు ప్రత్యేక బలగాలతో సోమవారం ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. పాత బస్టాండ్‌ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్‌ అంగడిబజార్‌, ఐబీ చౌరస్తా, ఎన్టీఆర్‌ చౌక్‌, ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్‌ కార్యాలయం నుంచి పోలీసుస్టేషన్‌ వరకు సాగింది. ఈ సందర్భంగా ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్‌ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగించేందుకు ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించినట్లు తెలిపారు. బీఎస్‌ఎఫ్‌ బలగాలు, జిల్లా సాయుధ పోలీసులు, పోలీసులు సుమారు 150 మంది పాల్గొన్నారు. బీఎస్‌ఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండెంట్‌ సంజయ్‌కుమార్‌, ఉట్నూర్‌, నార్నూర్‌ సీఐలు రామకృష్ణ, ప్రేంకుమార్‌, ఉట్నూర్‌ ఎస్సై మనోహర్‌ ఉన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు, ప్రత్యేక బలగాలు

బతుకమ్మ సంబురం



జనసంద్రంగా మారిన తాంసి వాగు

తలమడుగు/తాంసి/ఆదిలాబాద్‌: పదిహేను రోజులుగా ఉత్సాహంగా సాగిన బతుకమ్మ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తలమడుగు, తాంసి, భీంపూర్‌ మండలాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఉంచారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, డీజే సౌండ్‌, దప్పుచప్పుళ్ల మధ్య ఆడిపాడారు. పల్లెల్లో బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో అంటూ పాటలు హోరెత్తించాయి. అనంతరం ఊరేగింపుగా వెళ్ల వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెళ్లిరా అంటూ వీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌ కాలనీలోని హనుమాన్‌ ఆలయం వద్ద మహిళలు, యువతులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



తలమడుగులో..



తాంసిలో..



బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ..

భార్యపై డీజిల్‌ పోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్‌: భార్యపై డీజిల్‌ పోసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై కేసు నమోదు కేసినట్లు ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రాంనగర్‌కు చెందిన అడేల్లు ఆయన భార్య లక్ష్మితో గత 20 ఏళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం భార్యపై డీజిల్‌ పోసి నిప్పంటించాడు. నిద్రలో లేచిన కుమారుడు గణేశ్‌ మంటలార్పారు. లక్ష్మి కుడి భుజానికి గాయమైంది. కుమారుడు ఫిర్యాదుతో అడేల్లుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- తమ్ముడు, చెల్లెకు తీవ్రగాయాలు

గుడిహత్నూర్‌: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై డోంగర్‌గావ్‌ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబానికి చెందిన సోదరుడి మృతిచెందాడు. ఈ ఘటనలో తమ్ముడు, చెల్లెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్‌ ఘనీ (17) వారసంతల్లో ఉల్లి, వెల్లుల్లి వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. కాగా, ఆదిలాబాద్‌లోని వారి బంధువుల శుభకార్యానికి తమ్ముడు రహీం, చెల్లి ఉజ్మాను తీసుకుని పల్సర్‌ బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న వీరి బైక్‌ ఎదురుగా వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీకొంది. ఆటో సైతం బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఘనీ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన రహీం, ఉజ్మాను అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్‌ తెలిపారు.

గుండెపోటుతో కుంటాల జలపాతం గైడ్‌ మృతి

నేరడిగొండ: మండలంలోని కుంటల జలపాతం వద్ద గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న పోశెట్టి (65) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఇంటి వద్ద గుండెపోటుకు గురికాగా, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి మృతిచెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ట్రాక్టర్‌ అపహరించిన నిందితుడి రిమాండ్‌

భైంసాటౌన్‌: షోరూం నుంచి రోటావేటర్‌తో సహా ట్రాక్టర్‌ అపహరించిన కేసులో నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ ఎల్‌.శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని స్వరాజ్‌ ట్రాక్టర్‌ షోరూం నుంచి ఈనెల 14న శనివారం దుకాణం మూసి వెళ్లగా, 16న సోమవారం తెరిచి చూడగా ట్రాక్టర్‌ చోరీకి గురైనట్లు గుర్తించారు. మేనేజర్‌ ఎల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా, షోరూంలో మెకానిక్‌ పనిచేసే షారుక్‌ఖాన్‌ దొంగిలించినట్లు తేలిందన్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సైలు శ్రీకాంత్‌, పూర్ణేశ్వర్‌, సందీప్‌ ఉన్నారు.

ఇసుక లారీ సీజ్‌

బోథ్‌: మండల కేంద్రంలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని మైనింగ్‌ అధికారులు సోమవారం సీజ్‌ చేశారు. పక్కా సమాచారం మేరకు స్థానికులు లారీని ఆపి స్థానిక పోలీస్‌ స్టేషన్‌తోపాటు మైనింగ్‌ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్‌ జిల్లా టెక్నికల్‌ అధికారి రమేశ్‌ వేబిల్‌ను పరిశీలించగా 45 మెట్రిక్‌ టన్నుల ఇసుకకు అనుమతి ఉందన్నారు. మోతాదుకు మించి 60మెట్రిక్‌ టన్నుల లోడ్‌తో ఉన్నట్లు గుర్తించి రూ.30 వేల జరిమానా విధించామన్నారు.